తెలంగాణ జిల్లాలలో కరీంనగర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. సింగరేణి బొగ్గగనులు ఈ జిల్లాకు గుండెకాయ లాంటిది. మానేరు నదీ తీరం ప్రజల దాహార్తికి, వ్యవసాయానికి ఆలంబనగా ఉంది. చేనేత నైపుణ్యానికి సిరిసిల్ల స్థావరం. పొరుగు రాష్ట్రాలకు సైతం వెలుగులను పంచగల రామగుండం, త్రివేణీ సంగమంగా పిలవబడే కాళేశ్వరం, ప్రజల గుండెల్లో కొలువున్న వేములవాడ రాజన్న ఈ జిల్లా సంపదలు. కేంద్రీకృత చైతన్యం జగిత్యాల, కరువుతో కొట్టుమిట్టాడే హుస్నాబాద్, రాజకీయ వైవిధ్యాల్ని ఆదరించే హుజూరాబాద్ జిల్లాలోని ప్రధాన పట్టణాలు. మహదేవ్‌పూర్ అటవీ ప్రాంతం, గోదావరీ పరివాహక ప్రాంతాలు మేధోవిలసిత క్షేత్రాలు. ఇంత వైవిధ్యభరితమైన జిల్లాలో ప్రజల సుఖశాంతులను, కష్టాల కడగండ్లను, సమాజ చలనాన్ని నిశితంగా గమనించి కథలుగా మలచిన రచయితలు జిల్లాలోని ప్రతి ప్రాంతం నుంచి కన్పిస్తారు.

సాహిత్యంలో కథ ఒక పాయ లాంటిది. ఒకచోట శిల్పసౌరభంతో, మరోచోట జీవితాల్ని గర్భీకరించుకొని, వాస్తవిక చిత్రణలు, సంఘటన మలుపులు, స్థల కాలాల చైతన్యంతో ప్రవహిస్తూ తీరజనుల దాహార్తిని తీర్చి కథ నిలదొక్కుకుంది. ఒక ప్రాంత సాంఘిక, ఆర్థిక, రాజకీయ చరిత్రను నిర్మించడంలో కథ దోహదపడుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఆ ప్రాంత జనుల జీవన స్థితిగతులను, అభిరుచులను, సంస్కృతిని, ఉమ్మడితనాన్ని, ఉద్యమాల్ని, అభివృద్ధి క్రమసోపానాల్ని, ఒకటేమిటి సమస్తాన్ని కథ వ్యక్తీకరించింది. కవిత్వంలో, నవలలో ఎన్ని ధోరణులు వచ్చాయో కథల్లోనూ అన్ని ధోరణులు వచ్చాయి. సంఘ సంస్కరణ, అభ్యుదయ, విప్లవ, స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలన్నీ కథా సాహిత్యంలో ప్రతిబింబించాయి. కరీంనగర్ కథా సాహిత్యం ఈ ధోరణులన్నింటిని పుక్కిట పట్టింది.

తెలంగాణా తొలితరం కథకులుగా చెప్పబడుతున్నవారిలో జి.రాములు, గూడూరి సీతారాంలు కరీంనగర్‌కు చెందినవారు. జి.రాములు "పెరటిచెట్టు" పెద్దకథ. దున్నేవాడిదే భూమి అన్నట్లుగానే "గీసేవాడిదే చెట్టు" అనే నినాదాన్ని చెప్పే కథ ఇది. తెలంగాణాలో నిజాం వ్యతిరేకోద్యమం నడుస్తున్నది. రజాకార్ల దుండగాలు జరుగుతున్న కాలం అయినా అప్పుడు రాములు ధైర్యంగా గాంధీ సూక్తులను రచించాడు. వీరి ఆత్మఘోష కథ గ్రాంధిక భాషలో ఉంది. సంస్కరణ భావాలను చిత్రించే కథ ఇది. తెలంగాణ భాష, నుడికారాలతో వెలువడ్డవి "గూడూరి సీతారాం కథలు". బ్రాహ్మణ కులంలో పుట్టినా కింది వర్గం పాత్రలను ఎన్నుకొని వాళ్ళ నిత్య జీవితంలోని భాష నుడికారాలను ప్రయోగిస్తూ మంచి కథలు రాశాడు. అంగుడుపొద్దు ఇతని ప్రసిద్ధమైన కథ. పోరాటంలో న్యాయం తరపున నిలబడినందుకు సొంత అన్న దురాగతానికే బలియైన బండోల్ల తిరుపతయ్య కథని వీరు రక్తపూజ కథగా మలిచారు. తెలంగాణాలో నిజాం వ్యతిరేకోద్యమం ముమ్మరంగా సాగింది. రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమకారులు, ప్రజలు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారు. అటువంటి ఉద్యమకారులను రక్షించుకోవడంలో ప్రజలు అనేక మార్గాలను అనుసరించారు. అటువంటి నేపథ్యాన్ని ఆసరాగా చేసికొని గొల్లరామవ్వ కథను పి.వి.నరసింహారావు రచించారు.

1945 కాలంలో తెలంగాణ రైతాంగం భూమి సమస్యను ప్రధానం చేసుకొని అక్రమ లేవీలకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారు. ఈ దశలో వచ్చిన కథలు దొరల దౌర్జన్యాలకు బలయిన వ్యక్తుల జీవితాల్ని వర్ణించాయి. 1951లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ జరిగింది. ఈ కాలంలో వచ్చిన కథలు సంక్షుభిత జీవితాల్ని చిత్రించాయి. 1970వ దశకంలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పీడిత రైతాంగం భూస్వామ్య వ్యవస్థ మీద నెమ్మదిగా తిరుగుబాటు మొదలుపెట్టింది. స్వాతంత్ర్యానంతరం భూసంస్కరణలు, కౌల్దారీ చట్టాలు ఎన్ని వచ్చినా ఆచరణలో విఫలమయ్యాయి. శ్రమదోపిడి నిరాటంకంగా సాగింది.

వాటిని ప్రతిఘటించడానికి రైతాంగ పోరాటాలు ఉధృతమయ్యాయి. ఈ పోరాటాలకు సాక్షులుగా, కార్యకర్తలుగా, వ్యూహకర్తలుగా, స్వీకర్తలుగా, స్థానికులుగా, అనుభవించి పలవరించి ఆర్తితో కథలుగా మలచినవారు కరీంనగర్ కథకులు. వీరి కథలు సంఘం బలంతో ప్రజలు వైయక్తికంగాను, సామూహికంగాను దొరల, అధికారుల దుర్మార్గాలను ఎదిరించడాన్ని చిత్రించాయి. యదార్థ సంఘటనలకి అక్షరరూపం ఇచ్చాయి. తెలంగాణా రైతాంగ పోరాటానికి ఇవి డాక్యుమెంటరీలుగా నిలుస్తాయి. ఇక్కడే కథనంలో మౌఖికత వచ్చి చేరింది. తెలంగాణ భాష ప్రధాన శైలిగా మారింది. ఇటువంటి కథను చదువురాని ప్రజలు సౌతం చదివించుకునేవారు. ఆ క్రమంలో కథ పోరాటవాహిక అయింది. అది "బద్‌లా" అనే బలమైన కథా సంకలనం రూపంలో కరీంనగర్ నుంచి వెలువడింది. కథ సమిష్టి ఆచరణ నుండి ఆలోచన నుండి రూపొందడం ప్రారంభమయింది. జరుగుతున్న ఘటనలను ఒకరు, వేరొకరికి చెప్పడం ద్వారా కథ రాస్తున్న పద్ధతి నుంచి చెప్పే పద్ధతికి మారాల్సి వచ్చింది. ఇట్లా వచ్చిన కథల్లో "సంఘం", "కుంపటి", "మార్పు", "చేపలు" లాంటి కథలున్నాయి. దున్నేవానిదే భూమి, మిగులు భూముల పంపకం లాంటి ఆశయాలతో జరిగిన భూపోరాటాలను ఇక్కడి కథకులు తమ కథల్లో పొదుపరిచారు. ఈ పరంపర అల్లం రాజయ్య "ఎదురు తిరిగితే" కథ ద్వారా ఊపందుకుంది. ఇతడే రాసిన సృష్టికర్తలు అద్భుతమైన కథ. సర్వ సంపదలకు సృష్టికర్తలైన రైతాంగం పంటలను సృష్టించేవారే కాని వాటిని నాశనం చేసేవారు కారని, ప్రజలే నిజమైన సృష్టికర్తలని చెప్పే చక్కని కథ. భూమిపై, భూమి పుత్రుల హక్కు కోసం తిరుగుబాటు ఉద్యమాల ఆవశ్యకతను తెలిపే కథలు "భూమి" కథలు. తెలంగాణా సాంస్కృతిక ప్రతినిధిగా బతుకమ్మపండగ నిలుస్తుంది. పండగనాడు ధరల ఇంటి ముందర బతుకమ్మలను పెట్టు కొని ఆడడం రివాజు. వారి ఆటను చూస్తూ పెత్తందార్లు పైశాచికానందాన్ని పొందేవారు. ఈ సాంస్కృతిక ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, ఎదిరిస్తూ, 1979లో ముప్పాళ లక్ష్మణరావు ఎత్తుండ్లి పిడికిల్లు" అనే కథను రాశాడు. కాలువ మల్లయ్య రాసిన ఊరూరి కథ, గోపి రాసిన దొరగారి కుక్క, కథలతో పాటు భూమి, తల్లిచేప, సారాంశం లాంటి అనేక కథలు వచ్చాయి. తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన "ఈ భూమి ఎవరిచ్చిండ్రు" నా పాత స్నేహితుడు, సవారి లాంటి కథలేకాక బి.ఎస్.రాములు రాసిన అనేక కథలు ఆనాటి పరిస్థితులకు చిత్రిక పట్టాయి. ఛిద్రమైన వ్యవసాయిక బ్రతుకులను చిత్రించిన "మహాదేవుని కల", పరాయికరింపబడుతున్న రైతు బతుకుల నేపథ్యంలో వెలువడ్డ "మనిషి లోపలి విధ్వంసం", "శత్రువు నర్పన పాశం" మొదలైన కథలు కరీంనగర్ రైతు జీవితాల్ని చిత్రించాయి.

1989, 90లలో ఉవ్వెత్తున ఎగసిన భూపోరాటాల వల్ల భూస్వామ్య ఆధిపత్యం కూలుతున్న సన్నివేశం "చావువిందు" కథకు వస్తువు. కథ చదువుతున్నంతసేపు ఒక సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. దొరలవైపు నుంచి కథ నడపడం వల్ల భూస్వామ్య ఆధిపత్య పతనం, శ్రామిక జన విజయాన్ని దృశ్యాలుగా చూపడం వల్ల పోరాటక్రమం రెండు తెలుస్తాయి. చిన్న రైతులతో పాటు రైతుకూలీలు, పాలేర్ల జీతాల పెంపు, వెట్టిపనులు, వెట్టినిర్మూలన లాంటి విషయాలపై జరిగిన పోరాటాలను అక్షరీకరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే పోరాటాన్ని, ప్రతిఘటనను, నిర్బంధాన్ని అనేక సంఘటనల్ని సమస్తాన్ని ఈ కథ చిత్రించింది. అందుకోసం కథ పీడిత, తాడిత, నిమ్నజన భాషను ఎంచుకుంది. వారి మాటల్లోనే కథ నడిచింది. చాలామంది మాండలికంగా పిలిచే వీరి భాష సాహిత్య భాషగా రూపు దిద్దుకుంది. తమ బతుకులను తామే చదివి వినిపించుకున్న ఘట్టం కరీంనగర్‌లో జరిగింది. కథ నిమ్న వర్గాల కోసం మౌఖికతను సంతరించుకుంది. ఆనాటి కథ మట్టి మనిషికి గండపెండేరం తొడిగింది. ఆ మట్టిమనుషులు కథలను గుండెలకు హత్తుకున్నారు. మాండలికం అర్థం కాదన్న మనుషులు విషయం కోసం భాషను అర్థం చేసుకున్నారు. ఆహ్వానించారు. ఆ విధంగా జీవితం, భాష రెండూ పూవు, తావిలా కలగలిసిపోయి ఉంటాయని నిరూపించబడింది. తెలంగాణ కథల్లో శైలీ, శిల్పాలు ఉండవనే వాదనను, ఇలాంటి అనేక కథలు "అపవాదు"గా నిరూపించాయి. తాడిగిరి పోతరాజు "ఎర్రబుట్ట" కథను ప్రచురించిన విద్యుల్లత పత్రిక నిషేధానికి గురి అయింది. కరీంనగర్ కథల్లో జీవితం, జీవిత సమస్యలకు పరిష్కారం ఉంటాయనే విషయం ఈ సంఘటనతో రుజువైంది. పరిస్థితుల ప్రభావం వల్ల రైతాంగ కార్యకర్తలు భార్యాబిడ్డల్ని వదిలివెళ్ళవలసి వచ్చింది. ఆ సమయంలో కుటుంబంలో ఎంతో సంఘర్షణ జరగడం సహజం. ఈ పరిణామాల్ని అల్లం రాజయ్య "తుఫాను" బి.ఎస్.రాములు "మమకారం" కర్షక "షురూ", పి.చంద్ "సన్నజీవాలు" కథలు చిత్రించాయి. అందుగుల మొండయ్య, సత్యం లాంటి చాలా మంది కథలు అల్లారు. అల్లం వీరయ్య "పిలగాని ఏడుపు", "రెండు మరణాలు" బి.ఎస్.రాములు "దొంగగొడ్డుకు లొటారం" కాలువ మల్లయ్య "దొరగారి గడి", "ఆంబోతు" నులిమెల భాస్కర్ "మంద" మొదలైన కథలన్నీ పోరాటాల్ని ఊపిరిగా చేసుకొని రాయబడ్డవే.

మైదానాలకు దూరంగా కొండకోనల్లో, ప్రకృతి ఒడిలో జీవితాల్ని వెళ్ళదీసే ప్రజలే గిరిజనులు. పోడు వ్యవసాయం ద్వారా, అటవీ ఉత్పత్తులను ఏరుకొని తమ జీవనాన్ని సాగిస్తుంటారు. చలికాలం, వర్షాకాలంలో వీరి బాధలు చెప్పనలవి కాదు. వాటి బారినుంచి రక్షించుకునే ప్రయత్నంలో జీవితాల్ని కోల్పోవడం గమనార్హం. వాటితో బాధలు పడుతూనే సహజీవనం చేయడం వీరి జీవన శైలి. వీటికితోడు తమ ఆచార వ్యవహారాల వల్ల కూడా దుర్భర జీవితాల్ని వెళ్ళదీస్తుంటారు. ఇంతటి నిస్సహాయ గిరిజన జీవితాల్లోకి మైదాన ప్రాంతావారి రాకతో మరింత సంక్షోభం మొదలైంది. అంగడిలో వ్యాపారుల మోసాలకు, వడ్డీవ్యాపారుల దోపిడికి, మైదాన ప్రాంతాల ప్రజల వంచనకు ఈ గిరిపుత్రులు గురికావడం జరిగింది. 1/70 చట్టం లాంటివి నీరుకారిపోయాయి. ఇవన్నీ కూడా కరీంనగర్ కథల్లో కనపడుతాయి.

కరీంనగర్ జిల్లా అందించిన ఆణిముత్యం సాహు. దాదాపుగా ఇరవై కథల వరకు సాహు రచించాడు. అవన్నీ కూడా గిరిజనుల జీవితాలను, పరిస్థితులను ప్రతిబింబించాయి. దట్టమైన అడవుల్లో నీటికోసం గిరిజనులు పడే అవస్థలను, జంతువులతో చేసే యుద్ధాలను, ఆ క్రమంలో కోల్పోయే జీవితాలను సాహు కన్నీటికథ- నీటికథ చిత్రించింది. "నిర్ణయం" కథ పశువుల కాపరి బాధలను వర్ణించింది. పేపర్‌మిల్లు కోసం గిరిజనులు బొంగుపని చేస్తుంటారు. రోడ్డు వేస్తుంటారు. అందుకుగాను వారికి ముట్టే ప్రతిఫలంలో సగానికి సగం కాజేయడం. వారి అవిద్యను ఆసరాగా చేసుకొని, వారికి అందాల్సిన రేషన్‌ను తగ్గించి ఇవ్వడం నిత్యకృత్యాలు. ఆ చిక్కులెక్కలు తెలియని గోండులు నిరంతరం ఎదుర్కొనే దౌర్జన్యాల్ని, దోపిడీని సాహు రాసిన "రక్తపింజెర" కథ విప్పిచెప్పింది. ఇతనే రాసిన "మరట్ తుడుం పాయనా!" (మనందరం తుడుం గొట్టాలె) అనే కథ ఫారెస్టు అధికారులకి, వడ్డీవ్యాపారస్తులకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం గిరిజన గూడేలన్నిటిని కలుపుకొని సాయుధ భూపోరాటంగా రూపు దిద్దుకోవడాన్ని చిత్రించింది. గిరిజనులతో మమేకమైన, నక్సలైట్లను పోలీసుల బారినుండి కాపాడడానికి వారు ఎంతటి శ్రద్ధ తీసుకుంటారో "గంగజిమ్మ" కథ తెలుపుతుంది. పోరాడందే గిరిజన జీవితం మారదు అనే అనివార్య పరిస్థితికి దారి తీసిన అనేక సంఘటనలను క్రోడీకరించి, బి.ఎస్.రాములు రాసిన "అడవిలో వెన్నెల" కథ మరో యదార్థ దృశ్యం. యుద్ధ వాతావరణాన్ని తలపించే కథ "ఎర్ర రాజ్యం గెలిచి వస్తాం!". రెండు తరాల పాటు పండిన పంట అంతా కట్టి అప్పు తీర్చినా, అనామతు ఖాతాగా అయిదు రూపాయలు రాసి, దాన్నే అయిదు వందలు చేసి బాకీ వసూలు కోసం జప్తుకొచ్చిన షావుకారి దౌర్జన్యాన్ని చెప్పే కథ పి.చంద్ రాసిన 'అనామతు ఖాతా'. ఇతనే రాసిన "గెరిల్లా", "గుమ్మాన్ ఎగ్లాస్‌పూర్ గ్రామస్తుడు" కథలు కాంట్రాక్టర్ల బారినపడ్డ గిరిజన జీవితాల్ని చిత్రించాయి. బంక అమ్ముకునే గిరిజనులపై షావుకార్ల దమనకాండను చిత్రించిన కథ "ఎర్రజీర". బతుకుదెరువు కోసం గోండు స్త్రీ, అడవిదాటి కాలనీ ప్రాంతానికి వచ్చి వ్యభిచార కూపంలో దిగిన హృదయ విదారక విషయాన్ని అల్లం రాజయ్య "బురద" కథలో చిత్రించారు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కెరిమెరిఘాట్ రోడ్, తుడుం లాంటి కథలు అడవిలో జరిగే పోరాట దృశ్యాలను, నేపథ్యాలను పట్టిఇచ్చాయి. ఈ విధంగా 80, 90లలో ఆదిలాబాద్ గిరిజన పోరాటాలు ప్రారంభమైన తరువాత గిరిజనుల్లో వచ్చిన మార్పులను, ఉద్యమకారులు, గిరిజనులకు అందించిన చేయూతను కరీంనగర్ కథ రికార్డు చేసింది.

> **మైదానాలకు దూరంగా కొండకోనల్లో, ప్రకృతి ఒడిలో జీవితాల్ని వెళ్ళదీసే ప్రజలే గిరిజనులు. పోడు వ్యవసాయం ద్వారా, అటవీ ఉత్పత్తులను ఏరుకొని తమ జీవనాన్ని సాగిస్తుంటారు. చలికాలం, వర్షాకాలంలో వీరి బాధలు చెప్పనలవి కాదు. వాటి బారినుంచి రక్షించుకునే ప్రయత్నంలో జీవితాల్ని కోల్పోవడం గమనార్హం.**

హరిత విప్లవ ఫలితాలు ఒకవైపు, అణచివేత ప్రతిఫలనం మరోవైపు, ఇవేకాక, ఇంకా చాలా కారణాలతో పొట్ట చేత పట్టుకొని బతుకుదెరువును వెతుక్కుంటూ పల్లెలు వదిలిన ప్రజలు, సింగరేణి బొగ్గగనుల్లోకి కార్మికులుగా వచ్చి చేరారు. ప్రమాదభూయిష్టమైన పరిస్థితులు, కూలడానికి సిద్ధంగా ఉన్న గని కప్పులు, సేఫ్టీ డిపార్టుమెంటున్నా ఏమాత్రం శ్రద్ధ తీసుకోని అధికారులు, కార్మికులను, వాళ్ళ రక్షణను పట్టించుకోని యాజమాన్యం- ఇవీ సింగరేణి గనుల్లోని పరిస్థితులు. ఫలితంగా గని కార్మికులు ఎన్నో ప్రమాదాలకు గురవుతూ అంగవైకల్యానికి గురి కావడం, మృత్యువాత పడటం జరిగింది. భూమిపుత్రుల జీవితాలు బండకింది బతుకులయ్యాయి. బొగ్గుపొగ, మురుగువాసన, వెలుతురే లేని గుడిసెలు, నడవడానికి వీలులేని దారులు పరమదయనీయంగా ఉండే వాతావరణంలో జీవించేవారు. కార్మిక వాడలు మురికి కూపాలకు మారుపేరుగా ఉండేవి. రోజంతా, బతుకంతా దుర్భరంగా గడిపిన కార్మికులు తమ యాతనను కథలు కథలుగా చెప్పుకున్నారు.

(ఇంకావుంది)

– డా॥ బి.వి.ఎన్.స్వామి